


సిఎస్‌సి, సీతం మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాల, సిఎస్‌సి అకాడమీ మధ్య పరస్పరం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై సంతకం చేసిన మొదటి విద్యాసంస్థ సీతం. ఈ ఒప్పందంలో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లో శిక్షణ పొందేందుకు ఉచితంగా కోర్సులు నేర్పిస్తూ సి-డాక్, ఐఇఇఇ సర్టిఫికేట్ జారీ చేస్తుంది. కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థుల కోసం ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ ప్లాట్‌ఫారమ్‌లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి తెలిపారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు సమక్షంలో ఎంఒయూపై సంతకాలు జరిగాయి. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.డి.వి.ఎ నాయుడు, సిఎస్‌సి అకాడమీల విఎల్‌ఖై రామ్మోహనరావు, సిఎస్‌సి అకాడమీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ పి.సౌజన్య పాల్గొన్నారు.

జిపిఎస్‌పై పెల్లుబికిన నిరసనలు

బిల్లు ప్రతులు దగ్ధం ● చెప్పలతో కొట్టుకొని నిరసన తెలిపిన ఉద్యోగులు



జిపిఎస్ ప్రతులను కాల్చివేస్తున్న సిపిఎస్ ఉద్యోగులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఉద్యోగులకు నష్టం కలిగించే జిపిఎస్ బిల్లు పట్ల నిరసనలు వెల్లువెత్తాయి. ఆజీవో ప్రతులను గురువారం కలెక్టరేట్ వద్ద ఎపి సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. పాత పెన్షన్ ఇస్తామన్న హామీని నమ్మి అధికారం ఇచ్చినందుకు తమకు తగిన శాస్తి జరిగిందంటూ ఉద్యోగులు చెప్పులతో కొట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆర్.శివకుమార్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం కన్నా జిపిఎస్ విధానం మరింత లోపం భూయిష్ట మైనదని అన్నారు. సిపిఎస్ ఉద్యోగుకు ప్రభుత్వమే పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రధాన కార్యదర్శి కె.ధనుంజయ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్‌లు వద్దని, పాత పెన్షన్ మాత్రమే కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు కంది ఈశ్వరరావు, గంటా త్రినాథ్, శైలాడ అప్పలనాయుడు, కె.లక్ష్మణరావుపాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ కోట జంక్షన్ వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను కాల్చివేసి, నోటికి నల్ల రిబ్బనులు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ వై.పైడిరాజు, రాష్ట్ర కార్య కార్యవర్గ సభ్యులు వై.మధుసూదనరావు, జిల్లా అదనపు కార్యదర్శి ఎవి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు వి.అప్పలరాజు, పి.దామోదర నాయుడు, సి.హెచ్.పైడితల్లి, వడ్డాది వెంకటరావు ఎన్.కూర్మారావు, జిల్లా కౌన్సిలర్ కె.మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా : ఎపిటిఎఫ్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ బుఖారిబాబు, పాలతేరు శ్రీనివాస్ ఒక ప్రకటన లో కోరారు. ధర్నాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

30 నుంచి జెఎఎస్ వైద్య శిబిరాలు

- పలు స్పెషాలిటీ డాక్టర్ల ద్వారా పరీక్షలు
- ప్రజలంతా వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి
- జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలందరినీ ఆరోగ్య వంతులుగా రూపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం, మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని, వీటిని జిల్లా ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మండలంలో రోజు విడిచి రోజు హెల్త్, వెల్‌నెస్ సెంటర్ స్థాయిలో ఈ శిబిరాలను నిర్వహిస్తారని, పిహెచ్‌సి వైద్యులతో పాటు చిన్నపిల్లలు, స్త్రీల ఆరోగ్య సమస్యలకు చెందిన వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ కు సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరాలకు హాజరై ఆయా వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు పద్నాలుగు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి మందులు కూడా అక్కడే అందజేస్తారన్నారు. వైద్య పరీక్షల సందర్భంగా తదుపరి చికిత్స అవసరమని వైద్యులు సిఫారసు చేస్తే వారికి వ్యాధి పూర్తిగా నయమయ్యే వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించేలా జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి, ఆ ప్రాంత వైద్యాధికారి నిరంతరం పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు.

ప్రసూతి మహిళలు, బాలింతలు, చిన్నపిల్లలు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడే వారు ఈ శిబిరాల్లో పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్నందున వారికి శిబిరాల్లో వేచి వుండేందుకు కుర్చీల ఏర్పాటు, నీడనిచ్చేలా టెంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మందులు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఆరోగ్యశ్రీ కౌంటరు కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు రోగులకు తనిఖీలు చేసేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య శిబిరాలు ప్రారంభమయ్యేలోపే ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు జరిపే కార్యక్రమాన్ని శతశాతం పూర్తిచేయాలని కోరారు.

జిల్లాలో 500 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జిల్లాలో ఈనెల 30 నుంచి నవంబరు 9వ తేదీ వరకు 500 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వున్న 482 వెల్‌నెస్ సెంటర్ల పరిధిలో 482 శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లోని 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 18 శిబిరాలు కలసి మొత్తం 500 శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, తదితరులు మాట్లాడుతూ ఏర్పాట్లపై వివరించారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ముస్లిముల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని గురువారం నగరంలో ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహించారు. మిలాద్ ఉన్‌నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జయంతిని జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వేలాది మంది ముస్లిములు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. సహనం, శాంతి, సామరస్యం, ఐక్యతల సందేశాన్ని ప్రపంచానికి బోధించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు కరీమ్ కెపిసిసి మైనార్టీ వైస్ చైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్, మహమ్మద్ ముస్తఫా, అన్వర్ ఖాన్, ఎమ్‌డి యూనూస్, ఇక్బాల్, అన్సారీ, శీరత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి : కోలగట్ల

విజయనగరం టౌన్ : ముస్లిం మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం, మైనార్టీల ఆధ్వర్యంలో గురువారం నగరంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్న వారికి చల్లని పానీయాలు, ఖర్జూరాన్ని కోలగట్ల పంపిణీ చేశారు.

పండగకు రహదారులు పూర్తి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లమ్మ జాతర సమయానికల్లా వీలైనన్ని రహదారులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ జంక్షన్ నుంచి గంటస్థంభం వరకు నిర్మితమైన రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులు ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు, ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ నుంచి రామారాయుడు రహదారి, గణేష్ కోవెల నుంచి ఎస్‌బిటి మార్కెట్ వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి గంట స్తంభం వరకు, ఆర్ అండ్ బి జంక్షన్ నుండి పాల్ నగర్ వరకు ప్రధాన రహదారులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్యాంక్ బండ్ రోడ్ లో ఉన్న పెద్ద చెరువు గట్టు భాగాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నుండి నగరంలో ప్రత్యేక పారిశుధ్య విధానం పై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

రహదారి పనులు ప్రారంభం

నగరంలోని 7వ డివిజన్లో రూ.33.50తో ఏర్పాటు చేసిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. గురువారం ఆ డివిజన్‌లో శుద్ధ వీధి, యాతవీధి, గొల్లవీధులలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో స్థానికుల వినతి మేరకు రహదారి ఏర్పాటుకు హామీ ఇచ్చారు. రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకు వచ్చారు. మేయర్ విజయలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, జోనల్‌ఇంఛార్జి బొద్దాన అప్పారావు, వైసిపి నాయకులు పొంతపల్లి గోపి, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు

స్వామినాథన్ మృతి రైతులకు తీవ్ర లోటు

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్ర నిపుణులు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతులకు తీరని లోటని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు తెలిపారు. ఆయన మృతికి నివాళులర్పించారు. డాక్టర్ స్వామి నాథన్ భారత దేశాన్ని ఆహార ధాన్యాలు లోటు నుంచి మిగులు లోకి తీసుకు రావటంలో ప్రధాన భూమిక వహించారన్నారు. పంటలు లో హై బ్రిడ్ వంగడాలు రూపొందించి ఆహార ధాన్యాలు స్వయం సమృద్ధి లో కి తీసుకొని రావడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. రైతు పంటలకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాలకు వ్యవసాయ కమిషన్ ద్వారా సూచించారన్నారు. అటువంటి డాక్టర్ స్వామి నాథన్ మరణం రైతాంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

స్వామినాథన్ మృతికి డివిజి శంకర్రావు నివాళి

హరిత విప్లవ సారథి ఎంఎస్ స్వామినాథన్ మృతికి మాజీ ఎంపి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగానికి, ఆహార భద్రత కు,దేశ స్వావలంబన కు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వం లో దేశానికి హరిత విప్లవాన్ని సాధించడం ద్వారా ఆహార భద్రత కు బీజం వేయడానికి బలమైన సంకల్పం కలిగిందని, విధాన కర్తలకు తోడుగా బలంగా నిలబడిన శాస్త్రవేత్తల్లో ముఖ్యుడు స్వామినాథన్ అని కొనియాడారు. వరి,గోధుమల దిగుబడి అనతికాలంలోనే రెట్టింపు కావడానికి వారి కృషి ఎనలేనిదని తెలిపారవు. ఆహార పరాధీనత తొలిగి ఆహార భద్రత సాధించడానికి,ఇతర దేశాలకు మిగులు పంటను ఎగుమతి చేయగల సామర్థ్యం పొందడానికి బాటలు వేసిన ఆ మహనీయుడు చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆయన తన వద్దాప్యం లో కూడా వ్యవసాయ రంగానికి మేలుచేసే కృషి కొనసాగించారని తెలిపారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న దేశానికి, రైతు సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమైనవిగా చూడడం కీలకమని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అందుకు దారి చూపుతాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్త ను కోల్పోవడం దేశానికి తీరని లోటు అని తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భగత్ సింగ్ స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అమర వీరుల స్మారక భవనంలో భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలు సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు కిల్లంపల్లి రామారావు, టి. సన్ని బాబు, మొయిద పాపా రావు, కాళ్ళ అప్పల సూరి భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

చీపురుపల్లి: ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామాజంనేయ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విప్లవ వీరుడు స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ 117 జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ భగత్ సింగ్ చిత్రపటాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. విప్లవవీరుడు భగత్ సింగ్ 116వ జయంతిని జనసేన కార్యాలయంలో గురువారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అడబాల వెంకటేష్ నాయుడు, వజ్రపు నవీన్ కుమార్ , ఎమ్ .పవన్ కుమార్ , పృథ్వీ భార్గవ్, హిమంత్, కంకిపాటిరాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

కళావతికి కష్టకాలం

- అనుకూలంగా మలుచుకుంటున్న సుజన
- అండగా నిలుస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్?
- అధికార పార్టీలో వేడెక్కిన రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయ కళావతికి కష్టకాలం మొదలైంది. కొన్నాళ్లుగా ఆమె చుట్టూ నెలకున్న అసమ్మతిసెగ మరింతగా అలముకుంటోంది. ఎమ్మెల్యేపై అసంతృప్తి, అసమ్మతిని ఇదే అదునుగా పరిస్థితిని పాముల సుజన తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఇందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆశీస్సులు కూడా తోడవ్వడంతో పార్టీ తరపున తానే అన్ని సమస్యలూ పరిష్కరిస్తానంటూ సుజన ముందుకు దూసుకెళ్తున్నారు. మరోవైపు సుజన ముద్రించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే అనుయాయులు బహిరంగంగా తగల బెట్టడంతో పాలకొండలో అధికార పార్టీ పరిణామాలు తారాస్థాయికి చేరినట్టుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పాలకొండ ఎమ్మెల్యేగా కళావతి గతంతో రెండుసార్లు సునాయాసంగానే గెలుపొందారు. ఈ సారి ఆ పరిస్థితి తలకిందులుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆమె స్వయం కృపరాధమే ఇందుకు కారణని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాల ధోరణి పెరిగిందని చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ విక్రాంత్‌కు, ఆమెకు మధ్య నెలకున్న విభేదాలు కూడా ముదురుపాకాన పడ్డాయి. నియోజకవర్గంలో వ్యతిరేక సర్పంచులు, నాయకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈనేపథ్యంలో స్వపక్షంలో విపక్ష గళాన్ని అంచనా వేయడంలో ఎమ్మెల్యే విఫలమౌతూ వస్తున్నారు. భామిని మండలంలో ఆమె ఏకపక్ష వైఖరి మరోసారి బహిర్గతమై బెడిసికొట్టింది. దీంతో, ఆమె వ్యూహం బెడిసికొట్టి, మరింత తలనొప్పిగానే పరిణమించింది. వాస్తవానికి ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలపై చాలా రోజులుగా ఈ మండలంలో కొంతమంది నాయకులు కినుక వహిస్తున్నారు. ఇదే కారణంతో కొద్దిరోజుల క్రితం జరిగిన మండల పరిషత్ సమావేశాన్ని వైసిపికి చెందిన మెజార్టీ ఎంపిటిసి సభ్యులు బహిష్కరించారు. కోరం లేక వాయిదా వేయాల్సిన ఆ సమావేశంలో కేవలం నాలుగు పంచాయతీల్లో రూ.1కోటి ఖర్చు చేసేందుకు తీర్మాణం జరిగిపోయింది. ఈ పరిణామం వెనుక ఎమ్మెల్యే కీలకపాత్ర పోషించారంటూ ఎమ్మెల్యే వ్యతిరేక ఎంపిటిసి సభ్యులంతా గుర్రుగా ఉన్నారు. సీతంపేట, పాలకొండల్లో కూడా ఇదే రకమైన వివాదాలు వైసిపి నాయకుల్లో అసంతృప్తి రేపుతున్నాయి. ఈనేపథ్యంలో వైసిపిలో కొన్నాళ్లుగా చురుకుగావుంటున్న పాముల సుజన రాజకీయాలను తనకు అనుకులంగా మలచుకునే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తం పాలకొండ నియోకజవర్గంలోని కీలక సమస్యలను ప్రస్తావిస్తూ ఇటీవల ఒక కరపత్రాన్ని ప్రచురించారు. అందులో పేర్కొన్న సమస్యలన్నింటి పరిష్కారానికి కృషిచేస్తానని, ప్రజలు, నాయకులు తనను ఆశీర్వదించాలని అందులో పేర్కొన్నారు. దీంతో, ఎమ్మెల్యేతోపాటు ఆమె అనుయాయులు కంగు తిన్నారు. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో సుజన ముద్రించిన కరపత్రాన్ని తగలబెడుతూ వ్యతిరేక నినాదాలు కూడా చేశారు. టిడిపి సానుభూతిపరులతో జతకట్టిన సుజన పార్టీని రెండుగా చీలుస్తున్నారంటూ గుర్రుపెడుతున్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్, ఆయన అనుయాయులు సుజనను ప్రోత్సహిస్తున్నారని కూడా ఎమ్మెల్యే గ్రూపు ఆరోపణలు చేస్తోంది. ఈ వరుస పరిణామాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. పరిస్థితులు ఎలా మారుతాయో వేచిచూడాల్సిందే.



యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బి.శ్రీనివాసరావు నియమితు లయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని రాష్ట్ర యూత్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, నగర అధ్యక్షులు సతీష్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూత్‌ను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు శ్రీనివాసరావు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సన్యాసినాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోల్ వాల్ట్ లో రజత పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబుల్ పి.సన్యాసినాయుడును టిడిపి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత గురువారం తమ పార్టీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు కాదు

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు కాదని, అవినీతికి పాల్పడటం వల్లే అరెస్టు చేశారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు స్పష్టంచేశారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్టు చేసినట్లు టిడిపి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. చంద్రబాబు అవినీతిపై రెండేళ్ల నుంచి దర్యాప్తు సాగుతోందని, అక్రమాలు రుజువు కావడంతోనే చంద్రబాబును అరెస్టు చేశారని చెప్పారు. నకిలీ కంపెనీకి జిఎస్‌టి కట్టకుండా మార్పు చేసినట్లు అధికారులు గుర్తించినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయవాదులతో కేసును వాదించిన చంద్రబాబు తప్పు చేయలేదని న్యాయవాదులు అనడం లేదంటే అవినీతి చేసినట్లు అంగీకరించడమేనన్నారు. చంద్రబాబు చేసిన అవినీతికి శిక్ష తప్పదన్నారు. రాజ్యాంగానికి లోబడి చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. అవినీతికి పాల్పడితే ఎవరికైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం ఇందిరమ్మ కాలనీలో బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిమ్స్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఆర్‌డిఒ శేషశైలజ, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, తహశీల్దార్ రాజేశ్వరరావు, పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ అధ్యక్షులు పొట్నూరు రాజ్ కిరణ్, వైసిపి నాయకులు చంద్రంపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదు

ఎమ్‌పి జివిఎల్ నరసింహారావు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదని రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు తెలిపారు. మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలో ఉన్న స్టీల్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్, సింహాద్రి పరిశ్రమ లిమిటెడ్, గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ పరిశ్రమలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ నష్టాల బాటలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. కార్యక్రమంలో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, సింహాద్రి టిఎంటి పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు బండి రమేష్, మోహిత్ కుమార్, బాన్సీదర్ , బాలకృష్ణ, కృష్ణారావు, మహామాయ పరిశ్రమ ఎమ్‌డి అశోక్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనుల పరిశీలన

ప్రజాశక్తి - జామి

మండలంలో చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ గురువారం పరిశీలించారు. ఆమె హైవే బాధితుల సమస్యపై విచారణ నిమిత్తం జామి విచ్చేశారు. అనంతరం రీసర్వే గ్రామమైన లక్ష్మీపురం రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు వారి సమస్యలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి ఇకెవైసిపై తహశీల్దార్ హేమంత్ కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, భూసేకరణ అధికారులు ఉన్నారు.



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

గెడ్డలో ఇల్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక ఎస్‌సి, బిసి కాలనీలో గెడ్డను ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేపడుతున్నారని బొల్లు సంజీవరావు అనే వ్యక్తి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ రెవెన్యూ అధికారి రామునాయుడు ఇంటి నిర్మాణాన్ని గురువారం పరిశీలించి అడ్డుకున్నారు. వర్షాకాలంలో ఈ గెడ్డ ద్వారా పై నుంచి దిగువకు నీరు ప్రవహిస్తూ ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉండేదని, ఈ మధ్య గెడ్డను ఆనుకొని కాలనీ వాసులు కొంత మంది ఇష్టానుసారం ఆక్రమించుకొని శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని సంజీవరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. శాశ్వత నిర్మాణాలు పూర్తయితే కిందకు నీరు వెళ్లే సౌలభ్యం లేక ఇబ్బందులు పడతామని తెలిపారు. దీనిపై తహశీల్దార్ వెంటనే రెవెన్యూ సిబ్బందిని పంపించి అడ్డుకున్నట్లు సంజీవరావు తెలిపారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూప రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ, మోపాడ పిహెచ్‌సి డాక్టర్లు పావని, నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. మోపాడ పిహెచ్‌సి టీమ్‌కు తాను, డెంకాడ పిహెచ్‌సి టీమ్‌కు తహశీల్దార్ లక్ష్మి బాధ్యత వహిస్తామన్నారు. ఈనెల 30న పినతాడివాడలో, వచ్చే నెల 3న మోదవలసలో, 4న సింగవరం, 5న బొడ్డవలస, 6న గుణుపూర్ పేట, 7న అమకాం, 8న చొల్లంగిపేట, 10న రఘుమండ, 11న పెద్ద తాడివాడ, 12న అమకాం, 13న అక్కివరం, 16న జొన్నాడ, 17న గంట్లాం, 18న చింతలవలస, 19న బంటుపల్లి గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరాలను ఆ గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ వాసులు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయవద్దని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన స్వచ్ఛత హై కార్యక్రమంలో భాగంగా రామతీర్థం జంక్షన్, జంక్షన్‌లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రత ప్రతిజ్ఞలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ వాసులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా తీసుకొని ఇంటితో బాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడిపొడి చెత్తలను వేర్వేరుగా చేసి అందించాలని, ప్లాస్టిక్ నిషేధానికి సహకరించి హరిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమణ, మేస్త్రి బండి నాగ మధు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సచివాలయ కన్వీనర్ సతీష్

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -వేపాడ

మండలంలో వావిలపాడు గ్రామంలో సిసి రోడ్డు, డ్రెయిన్ల పనులను సచివాలయ కన్వీనర్ బి.సతీష్ ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలు, పంచాయతీ నుంచి రూ.5 లక్షలు మొత్తం 10 లక్షల రూపాయలతో ఈ పనులు చేపడుతున్నారు. దీంతో సర్పంచ్ బీల రాజేశ్వరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.జగన్నాథం నాయుడు, బి.శంకర్రావు, సి.సుభద్రమ్మ, సింహాద్రినాయుడు, వెంకటరావు, నాగిరెడ్డి రాజునాయుడు, జి.వెంకట్రావు, గుడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశోధన పత్రం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పరిశోధనా పత్రం తయారీ, ప్రచురణల గురించి మెకానికల్ విభాగాధిపతి ఎస్‌విఎస్‌కె దీపక్ కుమార్ వివరించారు. గురువారం సిసిసిడీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రారంభించారు. అనంతరం దీపక్ కుమార్ మాట్లాడుతూ యుజిసి, ఎఐసిటిఇ వంటి జాతీయ సంస్థలు కేవలం స్కోపస్, యుజిసి కేర్, డబ్ల్యుఒఎస్‌లో ప్రచురితమైన పత్రాలను మాత్రమే గుర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడయోల్, బెనర్జీ, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి -కొత్తవలస

ప్రకృతి వ్యవసాయంలో ద్రవ జీవామృతంతో మంచి ఫలితాలు వస్తాయని మండల్ రిసోర్స్ పర్సన్ ఈశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని గొల్లలపాలెంలో కషాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి భవాని పాల్గొన్నారు.


క్రమబద్ధ జీవనశైలితో గుండె వ్యాధులు దూరం

ప్రజాశక్తి -బొబ్బిలి

క్రమబద్ధమైన జీవనశైలి, ఒత్తిడి లేని జీవితంతో గుండెజబ్బుల బారిన పడకుండా ఉండవచ్చని ప్రముఖ కార్డియోలజిస్టు జి.మహేష్ అన్నారు. గురువారం బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి సిఇఒ శ్రీనివాస్ సంయుక్త ఆధ్వర్యాన వైద్య, గుండె పరీక్షల శిబిరాన్ని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో ఏర్పాటుచేశారు. శిబిరంలో 105 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు రామ్ కుమార్, రోటరీ సభ్యులు శ్రీహరి, జి.శ్రీనివాసరావు, నాగరాజు, రామకృష్ణ, చుక్క శ్రీదేవి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

డెంకాడలో 3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - డెంకాడ



అన్నదానంలో పాల్గొన్న కనక సింహాచలం

వినాయక ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం అన్న ప్రసాదాన్ని వడ్డించి కార్య క్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రులు సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరీ, ఉప సర్పంచ్ పాండ్రంగి ఆదినారాయణ, నాయకులు ఆర్ గోపాలకృష్ణ, తాతబాబు మాస్టర్, ఆర్ శేఖర్ మాస్టర్, పలువురు నాయకులు, గ్రామ వార్డు మెంబర్లు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి దీక్షలు



బాడంగి.. అరగుండు గీయించుకుని నిరసన తెలుపుతున్న టిడిపి అభిమాని

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస, బంగార్రాజుపేట, కొండ్రాజుపేట గ్రామాల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్య సాగర్‌నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన ఆదిబాబు, పడాల చిన్నారావు, సరగడ లక్ష్మి, కలిదిండి రంగరాజు, చిల్ల పద్మ, ముని పైడయ్య, ఎర్నింటి రాము, ఎర్నింటి శ్రీను తదితర పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ 6వ వార్డుకు చెందిన టిడిపి నాయకులు మండల కేంద్రంలో గురువారం రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, పార్లమెంట్ పార్టీ కార్యదర్శి లెంక అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, సువ్వాడ వనజాక్షి, భోగాపురం, మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ కుమార్, అధికార ప్రతినిధి గేదెల రాజారావు, లెంక హైమావతి పాల్గొన్నారు.

బాడంగి : సైకో సిఎం జగన్‌కి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన కోరారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా గురువారం బాడంగిలో నిరాహార దీక్ష చేపట్టారు. టిడిపి కార్యకర్త వై.రామినాయుడు అరగుండు కొట్టించుకొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస గౌరు, వైస్ ఎంపిపి ఎస్.భాస్కరరావు, చింతల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా బొబ్బిలిలో 16వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. దీక్షలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, ఎస్.సాయిరమేష్, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కనిమెరక వెంకటి, పూడి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: చంద్రబాబు అరెస్టుపై టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తపేటలో ప్రతి ఇంటికి తిరిగి బాబు అక్రమ అరెస్టును వైసిపి ప్రభుత్వం అన్యాయాన్ని అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కొత్తపేట మాజీ సర్పంచ్ గురాన అసిరినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్, కలిశెట్టి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -శృంగవరపుకోట

సామాజిక న్యాయం కోసం శుక్రవారం విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ నాయకులు మద్దిల రమణ, చెలికాని ముత్యాలు కోరారు. మండలంలోని శివరామరాజుపేటలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే కుట్ర చేస్తున్నారని తెలిపారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మిగులు భూములు ప్రజలకు పంచాలని కోరారు. చర్మకారులకు, డప్పు కళాకారులకు పింఛను రూ.5 వేలకు పెంచాలని డిమాండ చేశారు. వీటిపై విజయవాడలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.సంతోష్, ఎం.దేవా, ఎం.సురేష్, కె.ముత్యాలు, కె.ప్రతాప్, కె.దొరబాబు, కె.భానుప్రసాద్ పాల్గొన్నారు.

భారీ వర్షం

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5గంటల నుంచి నిరంతరాయంగా వర్షం కురవడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రహదారులపై వరదనీరు పొంగి పొర్లడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం ఖరీఫ్ పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల సహకారం మరువలేనిది

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -విజయనగరం



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జిల్లా పరిషత్ ఉద్యోగుల సహాయ సహకారాలు మరువలేనివని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లాస్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ బిల్డింగ్ ఆధునీకరణకు కావలసిన నిధులను జెడ్‌పి నుంచి సమకూరుస్తారని తెలిపారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చింతాడ మురళి, కార్యదర్శి వి. రాంబాబు, సహా అధ్యక్షులు కెబి శ్రీనివాసరావు, కోశాధికారి, పిఎం రవికుమార్ పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్‌కు భోగాపురం నాయకుల సన్మానం

భోగాపురం : జిల్లా పరిషత్ చైర్మన్‌గా మజ్జి శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు భోగాపురం నాయకులు విజయనగరంలో గురువారం ఘనంగా సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు కలిసి ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రావాడ బాబు, సచివాలయం కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, సర్పంచ్‌లు గరే మురళి, కర్రోతు వెంకటరమణ, పూడి నూకరాజు, డైరెక్టర్ నరసింహులు, నాయకులు పతివాడ రామకృష్ణ, రెయ్యుడు, కర్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఇకెవైసి చేశాకే భూహక్కు పత్రాలు

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను ఇ-కెవైసి చేసి రైతులకు పంపిణీ చేయాలని ఆర్‌డిఒ శేషశైలజ సూచించారు. గురువారం మండలంలోని రాముడువలస, కమ్మవలస రెవెన్యూ గ్రామాలలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అప్పయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు హ్యాండ్ బాల్ జట్లు

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

ఈనెల 29 నుండి అక్టోబర్ 1 వ తేదీ వరకు తెనాలి ఎఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ అండర్-17 బాల, బాలికలు జట్లు జిల్లా నుంచి గురువారం పయనమై వెళ్ళాయి. స్కూల్ గేమ్స్‌కు ఉమ్మడి జిల్లా నుంచి బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మంది బయలుదేరి వెళ్లారు. వీరంతా విజయంతో తిరిగి రావాలని జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్ వి రమణ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి డిటి గాంధీ ఆకాక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి -బొబ్బిలి

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 27న విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్-14, 17 పోటీలు జరిగాయి. పోటీలలో పట్టణంలో ఉన్న వివిధ విద్యాసంస్థలలో చదువుతున్న జి.చరిత, జె.తన్మయి, సోమేశ్ యాదవ్, కె.అభినవ్ ప్రతిభ కనబరిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. వీరిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు

ప్రజాశక్తి - వంగర

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నట్లు ఎపి ఇపిడిసిఎల్ ట్రాన్స్‌కో ఎస్ఇ ఎం. లక్ష్మణరావు అన్నారు. స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన గురువారం తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారుల అవసరాలకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సమస్యలుంటే సిబ్బందితో తక్షణమే పరిష్కరించే చర్యలు చేపడుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరా చేసేందుకు సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని, సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు మీటర్లుకు ఆధార అనుసంధానం చేయాలని వెల్లడించారు. గ్రామాల్లో విద్యుత్తు బకాయిలు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్తు మీటర్ల మంజూరుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, విద్యుత్తు బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చునన్నారు. విద్యుత్తు సమస్యలు ఏవైనా ఉంటే 1912 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ సురేష్ బాబు, ఏడి ఫణేంద్ర కుమార్, ఎఇ కె వినయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి మనసు చాటుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి -బాడంగి



దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ జయంతి

బాడంగి ఎస్ఐ జయంతి మంచి మనసు చాటుకున్నారు. ఇటీవల మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని బ్రహ్మన్నవలస గ్రామాన్ని విధి నిర్వహణలో భాగంగా ఎస్ఐ జయంతి సందర్శించారు. గ్రామంలో సుమారు 50 కుటుంబాలుండగా, అందులో 40 కుటుంబాలు ఎస్‌టిలే. అభివృద్ధికి దూరంగా ఉన్న వారికి ఏదైనా సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సొంత డబ్బులతో దుప్పట్లు, చీరలు కొనుగోలు చేసి, గురువారం బ్రహ్మన్నవలసలో గిరిజనులకు ఎస్ఐ జయంతి పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎస్ఐను అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్

గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -వేపాడ

కొత్తవలసలో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో బక్కునాయుడుపేట వద్దనున్న గురుకుల విద్యార్థినులు సత్తాచాటారు. అండర్-14, 17 విభాగాల్లో జరిగిన అన్ని క్రీడాంశాల్లోనూ ప్రతిభ కనబరిచారు. అండర్ - 14లో రేష్మ (100 మీటర్ల పరుగు పందెం), సుజాత (200, 400 మీటర్లు), సిహెచ్.కృష్ణవేణి (డిస్కస్ త్రో) మొదటి స్థానం సాధించారు. ఖోఖోలో రాధిక, సుజాత, అడుల్స్‌లో తనుశ్రీ విజేతలుగా నిలిచారు. అండర్-17లో వై.జానకి (డిస్కస్‌త్రో), డి.శిరీష (అడుల్స్), నిహారిక (జావెలిన్‌త్రో)లో మొదటి స్థానం సాధించారు. ఎన్.కీర్తి 3 కిలోమీటర్ల రేస్ వాక్‌లో ప్రథమ స్థానం సాధించింది. సత్తాచాటిన విద్యార్థులతో పాటు పిఇటి అరుణ, పీడీ ఆదిలక్ష్మిని ప్రిన్సిపల్ టి.ఎం.ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి, ఎస్.లక్ష్మి అభినందించారు.

చింతపల్లిలో చోరీకి యత్నం

ప్రతిఘటించిన తల్లీ కుమారుడు ● దాడి చేసి పారిపోయిన దుండగులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లిలో బుధవారం అర్ధరాత్రి చిరు వ్యాపారి మొంగం మూర్తి ఇంట్లో గుర్తు తెలియని దుండగలు చోరీకి యత్నించారు. ముగ్గురు దొంగలు ఇంట్లోకి వెనక డోర్ నుంచి ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించగా హాల్లో పడుకున్న మూర్తి తల్లి దమయంతి లేచి కేకలు పెట్టింది. పక్క గదిలో పడుకున్న మూర్తి వచ్చేసరికి దొంగలు ఆమెపై దాడి చేస్తున్నారు. మూర్తిని ఆయన తల్లిను కిందన పడేసి దొంగలు కొట్టి పారిపోయిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ముగ్గురు దొంగలు కర్రలతో దాడి చేయడం సీసీ కెమెరాలు చూసిన ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను దొంగతనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విలువైన వస్తువులేవీ పోలేదని, ప్రతిరోజు డబ్బులు సేవ్ చేసుకునే హుండీ ఎత్తికుపోయారని పోలీసులకు తెలిపారు. హుండీలో సుమారుగా రూ.20వేలు వరకు ఉండొచ్చని పోలీసులకు చెప్పారు. పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన ఇంటికి డాగ్స్‌స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీం కూడా వచ్చి దర్యాప్తు చేస్తుంది. సంఘటనా స్థలాన్ని డిఎస్‌పి గోవిందరావు పరిశీలించారు.

పట్టపగలే చోరీకి విఫలయత్నం

శృంగవరపుకోట : ఎవరూ లేని సమయంలో పట్టపగలే ఇంట్లోకి ప్రవేశించిన దొంగ యువతి మెడలో చైన్ తెంపేందుకు ప్రయత్నించిన సంఘటన పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. యువతి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పట్టణంలోని చింతా వీధికి చెందిన యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో దొంగ ఇంట్లోకి ప్రవేశించి మెడలో ఉన్న చైన్ పెంచేందుకు ప్రయత్నించాడు. ఆ యువతి కేకలు వేయడంతో దొంగ పరారయ్యాడు. చైను తెంపేటప్పుడు జరిగిన పెనుగులాటలో యువతి మెడకు గాయం కావడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ తారకేశ్వరరావు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -విజయనగరం

అయ్యన్నపేట జంక్షన్ సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులది గంట్యాడ మండలం కొటారుబిల్లి, తామరపల్లి గ్రామాలుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ పొడుగు అనిల్ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనిల్ ఇంటి నుంచి విజయనగరం వస్తుండగా ఎదురుగా వస్తున్న పాండ్రంకి అశోక్ వాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. అనిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా పరిషత్ చైర్మన్ సిబ్బంది వచ్చి మెరుగైన వైద్యం కోసం నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ మరో వ్యక్తి పాండ్రంకి అశోక్ తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్నాడు. వన్ టౌన్ ఎస్ఐలు అశోక్ కుమార్, మురళి కేసు దర్యాప్తు చేపట్టారు.